క్లుప్తంగా

జీవన విధానంలో భద్రత అనేది భాగం కావాలి

ఇబ్రహీంపట్నం: భద్రత అనేది కార్మికుల జీవన విధానంలో భాగం కావాలని ఎన్టీటీపీఎస్ చీఫ్ ఇంజినీర్ పి.అశోక్‌కుమార్‌రెడ్డి అన్నారు. జాతీయ భద్రతా వారోత్సవాలను ఆయన శనివారం ప్రారంభించారు. ప్రతిఒక్కరూ భద్రతా ప్రమాణాలు పాటించి సంస్థ ఆస్తులకు నష్టం కలగకుండా సంస్థ పురోభివృద్ధికి దోహదపడాలన్నారు. కర్మాగారాల మేనేజర్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ విధి నిర్వహణలో భద్రతా పరికరాలు ధరించాలన్నారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఘనంగా వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు

జి.కొండూరు: మండలంలోని వెల్లటూరు రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు రెండో రోజు శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం విష్వక్షేనారాధన, భేరీపూజ, బలిహరణ, ధ్వజారోహణ, నిత్యహోమం, పెండ్లి కుమారుని చేయుట, విశేషార్చన, ప్రసాద వినియోగం వంటి కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం నవకుంభారోపణ, నిత్యహోమం, ఎదురుకోల మహోత్సవం, తీర్థప్రసాద వినియోగం వంటి కార్యక్రమాలను నిర్వహించారు.

వీటీపీఎస్ స్టోర్‌పై అసత్యాలు నమ్మవద్దు

ఇబ్రహీంపట్నం: వీటీపీఎస్ ఆఫీసర్స్ కన్జ్యూమర్స్ కోఆపరేటివ్ స్టోర్స్, ఆటోకేర్ సెంటర్ (పెట్రోల్ బంక్)లో అవకతవకలు జరిగాయని కొందరు సామాజిక మాధ్యమాల్లో పెట్టిన అసత్య ప్రచారాలను ఖండించినట్లు పాలకవర్గం కమిటీ అధ్యక్షుడు జీఆర్ఎస్‌వీకే అప్పారావు, కార్యదర్శి యు.నాగాంజనేయులు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. అవాస్తవాల ఆధారంగా విజయవాడ విభాగ సహకార శాఖ అధికారి పి.కిరణ్‌కుమార్ శాఖా పరమైన దర్యాప్తు చేయాలని సీనియర్ ఇన్‌స్పెక్టర్ శ్రీహర్షను నియమించారని పేర్కొన్నారు. విచారణ పూర్తయిన అనంతరం అవకతవకలు బయటపడితే ఉద్యోగులపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

18న బాలోత్సవం

తిరువూరు: తిరువూరులో ఈ నెల 18వ తేదీన బాలోత్సవం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆహ్వాన కమిటీ తెలిపింది. స్థానిక వాహినీ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం ఈ కార్యక్రమానికి సంబంధించిన ప్రచార కరపత్రాలను ఆవిష్కరించారు. కళాశాల చైర్మన్ వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ నాగేంద్రబాబు, కమిటీ సభ్యులు పాపారావు, నాగేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

బీసీ విభాగాన్ని బలోపేతం చేయాలి



ఇబ్రహీంపట్నం: ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్ సీపీ బీసీ విభాగం అధ్యక్షుడిగా నియమితులైన నిడుముక్కల శివశంకరరావు రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్‌ను శనివారం మర్యాదపూర్వకంగా ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా మంత్రి జోగి రమేష్ శివశంకరరావును సత్కరించి అభినందించారు. జిల్లాలో బీసీ విభాగం, వైఎస్సార్ సీపీ బలోపేతం అయ్యేలా కృషి చేయాలని సూచించారు.

పోలీసుల అదుపులో 12మంది యువకులు

ఇబ్రహీంపట్నం: కొండపల్లి శాంతినగర్‌లో ఓ యువకుడి పుట్టినరోజు వేడుకల పేరుతో అర్ధరాత్రి హంగామా సృష్టించిన 12మంది యువకులు, ముగ్గురు మహిళలను శుక్రవారం రాత్రి పోలీసులు అదుపులోకి తీసకున్నట్లు వెస్ట్ జోన్ ఏసీపీ హనుమంతరావు తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం వివరాలు వెల్లడించారు. వారి వద్ద నుంచి కిలో గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. విజయవాడ నుంచి గంజాయి తెచ్చిన కిషోర్ అనే యువకుడు పరారయ్యాడు. ముగ్గురు మహిళలు వంట నిమిత్తం వచ్చినట్లు విచారణలో తేలగా వదిలివేసినట్లు తెలిపారు. పరారైన కిషోర్ ఆచూకీ లభిస్తే గంజాయి వివరాలు తెలుస్తాయన్నారు. గంజాయిపై యువకులను విచారించి కేసులు నమోదు చేస్తామని తెలిపారు. సీఐ పి.శ్రీను, ఎస్ఐలు పాల్గొన్నారు.

సచివాలయాల తనిఖీ

విస్సన్నపేట: చంద్రుపట్ల, పుట్రేలలోని రెండు సచివాలయాలను ఎంపీడీఓ ఎస్.వెంకటరమణ శనివారం పరిశీలించారు. సచివాలయం ద్వారా అందించే సేవలు సకాలంలో ప్రజలకు అందించాలన్నారు. సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చూడాలన్నారు.

కేంద్ర ప్రభుత్వం షరతులను రద్దు చేయాలి

పుల్లూరు(మైలవరం): ఉపాధి హామీ పథకంలో పనిచేసే కూలీల పొట్ట కొట్టే విధంగా కేంద్ర ప్రభుత్వం పెట్టిన షరతులను రద్దు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.రామారావు పేర్కొన్నారు. మైలవరం మండలం మంగాపురంలో జరుగుతున్న ఉపాధి పనులను శనివారం సీపీఎం నాయకులు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది ప్రవేశ పెట్టిన అతి తక్కువ బడ్జెట్‌ను పరిశీలిస్తే త్వరలో జాతీయ ఉపాధి పథకాన్ని రద్దు చేసి, పేదలు పొట్ట కొట్టే విధంగా కన్పిస్తోందన్నారు.

జగనన్న పాలనలో సంక్షేమానికే ప్రాధాన్యం

ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకట ప్రతాప్ అప్పారావు

ముసునూరు: జగనన్న పాలనలో సంక్షేమమే ప్రధానమని నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. మండలంలోని బలివే గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న నిజమైన అభివృద్ధిని అందరూ గుర్తించి, వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేయాలని కోరారు. జెడ్పీటీసీ సభ్యుడు వరికూటి ప్రతాప్, ఎంపీపీ ఆర్.కృష్ణకుమారి సుబ్బారావు, వైస్ ఎంపీపీ రాజానాయన, సర్పంచ్ రావు ప్రవీణ సుధాకర్, ఎంపీటీసీ సభ్యులు రాటాలు, బలివే దేవస్థాన కమిటీ చైర్మన్ నాగేశ్వరరావు, స్టేట్ హిస్టరీ అకాడమీ డైరెక్టర్ పి.స్వరూపరాణి, ఎంపీడీఓ జి.రాణి, తహసీల్దార్ డి.సుధ, వ్యవసాయాధికారి శ్రీనివాసరావు, ఏఈ నరసింహారావు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీని బలోపేతం చేయాలి



ఎమ్మెల్యేను సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల ఏలూరు జిల్లా అధ్యక్షులు

నూజివీడు: వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాలకు గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు కమిటీలను బలోపేతం చేసుకుని రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఘన విజయానికి కృషి చేయాలని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకత్వం ఇటీవల నూతనంగా నియమించిన అనుబంధ విభాగాల జిల్లా అధ్యక్షులతో ఎమ్మెల్యే శనివారం తన కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశంలో ఏ రాష్ట్రంలో కూడా అమలు కావడం లేదన్నారు. ఈ విషయాన్ని క్షేత్రస్థాయిలోని ప్రజల వద్దకు విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. పేదలు, మధ్య తరగతి ప్రజలు, రైతులు, డ్వాక్రా మహిళలు, విద్యార్థులు ఇలా అన్ని వర్గాల ప్రజల కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అనేక పథకాలు అమలు చేస్తూనే, రాష్ట్రాభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. ప్రజలందరూ తప్పనిసరిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతుగా నిలబడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సమావేశంలో క్రిస్టియన్ మైనారిటీ విభాగం అధ్యక్షుడు పిళ్లా చరణ్, యువజన విభాగం, బీసీ సెల్, ఎస్సీ సెల్, ముస్లిం మైనారిటీ, చేనేత, వైఎస్సార్ ట్రేడ్ యూనియన్, పంచాయతీరాజ్ విభాగాల జిల్లా అధ్యక్షులు గిరి గౌడ్, ప్రసాదరావు, తెర ఆనంద్‌బాబు, రాజా అహ్మద్, సత్యన్నారాయణ, మురళీ, గోపీ పాల్గొన్నారు.

కవులూరులో రూ.13.74 కోట్లతో అభివృద్ధి

ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్



ప్రభుత్వ పథకాల పంపిణీ తీరును మహిళను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వసంత

జి.కొండూరు: కవులూరు గ్రామంలో రూ.13.75కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని కవులూరు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి గడపకు వెళ్లిన ఎమ్మెల్యే వసంత, ప్రభుత్వం నుంచి ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులను కేటాయించిందని తెలిపారు. నాయకులు, అధికారులు సమన్వయంతో గ్రామాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న మంచిని గుర్తించి ప్రజలంతా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి మద్దతుగా నిలవాలని సూచించారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కళ్లకు కనిపించని దుష్ట శక్తులు విష ప్రచారం చేస్తున్న నేపథ్యంలో ఆ శక్తులను ఎదుర్కోవడానికి ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉండాలన్నారు. గ్రామ వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, గ్రామ వారధులు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సూచించారు. సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు చర్యలు చేపడతానని ఎమ్మెల్యే భరోసానిచ్చారు.

కొనసాగుతున్న గ్రౌండ్ వ్యాలిడేషన్



గ్రౌండ్ వ్యాలిడేషన్ ప్రక్రియను నిర్వహిస్తున్న సర్వేయర్లు

గంపలగూడెం: స్వామిత్ర సర్వేలో భాగంగా గంపలగూడెంలో రెండో దశ గ్రౌండ్ వ్యాలిడేషన్ ప్రక్రియ కొనసాగుతోంది. ముందుగా గ్రామంలో డ్రోన్ ఫ్లయ్ నిర్వహించి చిత్రాలను సేకరించి సర్వే ఆఫ్ ఇండియాకు పంపారు. అక్కడ నుంచి వచ్చిన ఓఆర్ఐ మ్యాప్‌ల ఆధారంగా గ్రౌండ్ వ్యాలిడేషన్ కొనసాగిస్తున్నారు. మొదటి దశలో గ్రామంలో మొత్తం 3,400 గృహాలు, ఖాళీ స్థలాలు ఉన్నట్లు నమోదయ్యాయి. సంబంధిత స్థలాలు, ఇళ్లకు సంబంధించి ప్రస్తుతం గ్రౌండ్ వ్యాలిడేషన్ కొనసాగిస్తున్నారు. గృహ, స్థలాల యాజమానులు నుంచి ఆధార్‌కార్డు, ఇంటి పన్ను రసీదు, స్థలాలకు సంబంధించి ఏమైన పత్రాలు ఉంటే ఆధారాలను శనివారం అధికారులు సేకరించారు. ఎంపీడీఓ వై పిచ్చిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి జి. శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో గ్రామ సర్వేయర్లు విజయలక్ష్మీ, గోపి సంబంధిత పత్రాలను సచివాలయంలో సేకరిస్తున్నారు.

పెరటికోళ్ల పంపిణీ



డ్వాక్రా మహిళలకు పెరటి కోళ్లను పంపిణీ చేస్తున్న విజయభాస్కరరెడ్డి

రెడ్డిగూడెం: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద డ్వాక్రా మహిళలకు పెరటి కోళ్లను శనివారం జెడ్పీటీసీ సభ్యుడు పాలంకి విజయభాస్కరరెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళల సాధికారిత, జీవనోపాధిని మెరుగుపరచుటకు పెరటికోళ్ల పెంపకం కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. వైస్ ఎంపీపీ చాట్ల రాబర్టు, ఎంపీటీసీ సభ్యులు కుప్పిరెడ్డి వర ప్రసాద్ రెడ్డి, వీరస్వామి నాయుడు, నాయకులు పాటిబండ్ల సత్యం, సచివాలయ కన్వీనర్ భరత్‌కుమార్‌రెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, ఎంపీడీఓ శంకరరావు, వెలుగు ఏపీఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

ఎ.కొండూరు: స్వయం సహాయ సంఘాలకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని వెలుగు ఏపీఎం ఆర్.సత్యం పేర్కొన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం డ్వాక్రా గ్రూపు సభ్యులకు పెరటికోళ్లను తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఏపీఎం పంపిణీ చేశారు.

తిరువూరులో..

తిరువూరు: మండలంలోని పొదుపు సంఘాల సభ్యులైన మహిళలకు శనివారం పెరటికోళ్ల పెంపకం లో భాగంగా కోడి పిల్లలను పంపిణీ చేశారు. 58 మందికి రూ.4,400 విలువ కలిగిన కోళ్లతో పాటు 50 కిలోల దాణా, మందుల కిట్ ను ఇన్‌చార్జి ఎంపీడీఓ నాగేశ్వరరావు అందజేశారు. గతంలో 78 మందికి ఈ యూనిట్లను మంజూరు చేశామని వెలుగు ఏపీఎం గురవయ్య తెలిపారు.

గంపలగూడెంలో..

గంపలగూడెం: వైఎస్సార్ క్రాంతి పథం ఆధ్వర్యంలో గంపలగూడెంలో శనివారం స్వయం సహాయక సంఘాల మహిళలకు పెరటికోళ్లను పంపిణీ చేశారు. స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు లింగమ్మ, ఏపీఎం నాగరాజు 85 యూనిట్ల పెరటికోళ్లను మహిళలకు పంపిణీ చేశారు.

విద్యార్థులకు ప్లేట్ల పంపిణీ



చాట్రాయి: ప్రభుత్వ పాఠశాలలకు దాతలు అందిస్తున్న సహాయ సహకారాలు మరువలేనివని మండలంలోని ఆరుగొలనుపేట సర్పంచ్ పుచ్చకాయల అప్పిరెడ్డి అన్నారు. శనివారం గ్రామానికి చెందిన దాత నండూరి విఠల్‌రావు సహకారంతో రూ.15 వేలు విలువ చేసే ప్లేట్లు, గ్లాసులు విద్యార్థులకు పంపిణీ చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ వెంకటేశ్వర్లు, పీఎంసీ చైర్మన్ శ్రీదేవి, హెచ్ఎం కె.నాగరాజు పాల్గొన్నారు.

బాబాయ్‌పై దాడి

నూజివీడు: ఐదు సెంట్ల ఇంటి స్థలం కోసం అన్న కొడుకు బాబాయ్ కోట చినకోటయ్యపై దాడి చేసిన సంఘటన మండలంలోని సిద్ధార్థనగర్‌లో శనివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు సిద్ధార్థనగర్‌కు చెందిన కోట శోభనంకు ముగ్గురు కొడుకులు, ఒక కుమార్తె ఉన్నారు. వీరందరి వివాహాలు అవ్వడంతో పాటు ఆస్తి సైతం పంచుకుని జీవిస్తున్నారు. శోభనం పేరున ఐదు సెంట్ల ఇంటి స్థలం ఉంది. చూసేవారు లేక అతను నెలకొక కుమారుడి ఇంటి వద్ద ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో ఇతని మనుమడు కోట మహేష్ తన తాతను ఐదు సెంట్ల ఇంటి స్థలం తన పేరున రాయాలని తరచూ ఒత్తిడి చేస్తున్నాడు. తన తదనంతరం చూద్దామని మనువడికి చెబుతున్నాడు. అయితే ఇంటి స్థలం తన పేరున రాయకపోవడానికి తన బాబాయ్ చిన కోటయ్యే కారణమని భావించి మహేష్ తన బావమరిది అఖిల్ కలిసి శనివారం మధ్యాహ్నం చిన కోటయ్య ఇంటికి వెళ్లి కర్రలతో దాడి చేసి కొట్టారు. భార్య అడ్డు వెళ్లగా ఆమెను సైతం కొట్టారు. తీవ్రంగా గాయపడిన కోటయ్యను భార్యే ఆటోలో ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లింది. బాధితుడి ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ శ్రీనివాసరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా జాతీయ లైన్‌మెన్ల దినోత్సవం



ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణ ప్రసాద్ చేత కేకును కట్ చేయిస్తున్న విద్యుత్‌శాఖ అధికారులు



లైన్‌మెన్లకు ప్రశంసాపత్రాలు అందజేసిన ఈఈ కృష్ణనాయక్

జి.కొండూరు: జాతీయ లైన్‌మెన్ల దినోత్సవాన్ని కవులూరు గ్రామంలో విద్యుత్ శాఖ అధికారులు శనివారం ఘనంగా నిర్వహించారు. కవులూరులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్‌ని కలిసిన విద్యుత్‌శాఖ అధికారులు, ఎమ్మెల్యే చేత కేకును కట్ చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మనకు నిరంతరం వెలుగునిచ్చేందుకు ప్రాణాలను సైతం పణంగా పెట్టి విధులు నిర్వర్తించే లైన్‌మెన్లను ప్రతి ఒక్కరూ గౌరవించాలన్నారు. జి.కొండూరు విద్యుత్ శాఖ ఏఈ సీహెచ్ రామ్మోహన్‌రావు, 327 యూనియన్ వైస్ ప్రెసిడెంట్ జార్జ్‌ముల్లర్ పాల్గొన్నారు.

తిరువూరులో..

తిరువూరు: కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిల ఉత్తమ సేవలందించిన తిరువూరు సబ్ డివిజన్లోని ముగ్గురు విద్యుత్ లైన్‌మెన్లకు శనివారం లైన్‌మెన్ దివస్ పురస్కారాలు లభించాయి. పోలిశెట్టిపాడు లైన్‌మెన్ కోటేశ్వరరావు, తిరువూరులో కాశేశ్వరరావు, కంభంపాడులో అప్పారావులు విధి నిర్వహణలో అంకిత భావంతో పని చేసి ఈ పురస్కారానికి ఎంపికైనట్లు ఏపీఎస్‌పీడీసీఎల్ డీఈ కృష్ణనాయక్ తెలిపారు.

విద్యుత్ సరఫరాలో లైన్‌మెన్ల పాత్ర కీలకం

ఇబ్రహీంపట్నం: గ్రామాల్లో విద్యుత్ సరఫరా చేయడంలో లైన్‌మెన్ల పాత్ర కీలకమని ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ అన్నారు. స్థానిక ఏపీసీపీడీసీఎల్ రూరల్ డివిజన్ కార్యాలయంలో జరిగిన లైన్‌మెన్ దివస్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

కీలకపాత్ర లైన్‌మెన్లదే

నూజివీడు: విద్యుత్ సంస్థల అభివృద్ధిలో క్షేత్రస్థాయిలో పనిచేసే లైన్‌మెన్లే మూల స్తంభాలని ఏపీసీపీడీసీఎల్ నూజివీడు ఈఈ డీ కృష్ణనాయక్ అన్నారు. పట్టణంలోని ఈఈ కార్యాలయం వద్ద శనివారం లైన్‌మెన్ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈఈ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో వినియోగదారులకు పనిచేసేది మాత్రం లైన్‌మెన్లేనని అన్నారు. నూజివీడు రూరల్, తిరువూరు డీఈలు పోతురాజు, రామకృష్ణ పట్టణ ఏఈ సత్యనారాయణ, మీర్జాపురం ఏఈ బాబూరావు, ఏఏఓ ప్రసాదరావు పాల్గొన్నారు.

వంటగ్యాస్ ధర పెంపునకు నిరసన



నూజివీడులో ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

నూజివీడు: కేంద్ర ప్రభుత్వం ఇష్టారాజ్యంగా వంట గ్యాస్ ధరలను పెంచుతూ సామాన్య, మధ్య తరగతి ప్రజల నడ్డి విరుస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జీ రాజు ధ్వజమెత్తారు. పట్టణంలోని చిన్నగాంధీబొమ్మ సెంటర్‌లో వంట గ్యాస్ ధర పెంపునకు నిరసనగా శనివారం పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పెట్రోలు, డీజిల్ ధరలతో పాటు వంట గ్యాస్ ధరలను పెంచుతూ దేశంలోని పేద, మధ్య తరగతి జీవనాన్ని అస్తవ్యస్తం చేసిందన్నారు. దేశంలో మూడు రాష్ట్రాల ఎన్నికలు ముగియగానే వంటగ్యాస్ సిలిండర్‌ను రూ.50, కమర్షియల్ గ్యాస్ సిలిండర్‌కు రూ.350 చొప్పున పెంచిందన్నారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం నేర్పేందుకు దేశ ప్రజలు సిద్ధంగా ఉన్నారన్న విషయాన్ని గుర్తెరిగి మసులుకోవాలని హెచ్చరించారు. సీపీఎం పట్టణ కార్యదర్శి ఎన్ఆర్ హనుమాన్లు, నాయకులు దుర్గారావు, మరియదాసు, రామకృష్ణ, ఏసుదాసు, శ్రీనివాస్, చంద్రశేఖర్, ప్రభాకర్ పాల్గొన్నారు.

పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలి

మంగాపురం(మైలవరం): కేంద్ర ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్ ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఎం సీనియర్ సభ్యులు, మాజీ మండల పార్టీ కార్యదర్శి రావూరి రామారావు డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో మైలవరం మండలం మంగాపురం సెంటర్‌లో వంట గ్యాస్ ధరలు వెంటనే తగ్గించాలని కోరుతూ శనివారం ఖాళీ గ్యాస్ బండలతో మహిళలతో కలిసి నిరసన ప్రదర్శన నిర్వహించారు. వ్యవసయా కార్మిక సంఘం మండల అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, మల్లయ్య, సుందరరావు, సుబ్బారావు, జార్జీ, పీ తిరుపతమ్మ, సుబ్బమ్మ, లక్ష్మీ, సనీత, జమున, జయమ్మ పాల్గొన్నారు.

ఆధునిక టెక్నాలజీపై అవగాహన పెంచుకోవాలి

మైలవరం: ఆధునిక టెక్నాలజీపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని ఈసీఈ ప్రొఫెసర్ డాక్టర్ జీ శ్రీనివాసులు తెలిపారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో సమగ్ర శిక్షా-ప్రీ-ఒకేషనల్ కోర్సులో భాగంగా స్థానిక డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాల 6,7,8 తరగతలు విద్యార్థులకు రెండు రోజులు పాటు అవగాహనా సదస్సు జరిగింది. శనివారం ముగింపు కార్యక్రమంలో ప్రొఫెసర్ శ్రీనివాసులు మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ కాంపోనెంట్స్, ఎలక్ట్రానిక్స్ మెషీన్స్ నేర్చుకోవడం వలన టెక్నాలజీ ఏ విధంగా అభివృద్ధి చెందుతుందో వివరించారు. ఈఈఈ విభాగానికి చెందిన అధ్యాపకులు విద్యార్థులకు ఎలక్ట్రికల్ మోటార్స్, జనరేటర్స్‌పై అవగాహన కల్పించారు. అసోసియేట్ ప్రొఫెసర్ రాణి రుద్రమ, నాగలింగాచారి విద్యార్థులకు ఎలక్ట్రానిక్స్ పరికరాలపై అవగాహన కల్పించారు. కళాశాల ప్రెసిడెంట్ జీ.శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ అపాపరావు, ఎన్ఎస్ఎస్ ప్రొగ్రాం ఆఫీసర్ బి.శివ హరిప్రసాద్ పాల్గొన్నారు.

సంక్షిప్తం

■ 6, 7 తేదీల్లో వైఎస్సార్ కంటి వెలుగు

ఆగిరిపల్లి: మండలంలోని అడవినెక్కలం సచివాలయంలో ఈ నెల 6, 7 తేదీల్లో వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆగిరిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి జగన్‌మోహనరావు శనివారం తెలిపారు. 60 ఏళ్లు దాటిన వారికి కంటి పరీక్షలు నిర్వహిస్తామన్నారు.

■ వీఆర్వో శ్రీనివాసరావు మృతి

గంపలగూడెం: కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో అస్వస్థతగా ఉంటున్న గంపలగూడెం-1 వీఆర్వో కాకి శ్రీనివాసరావు(52) శుక్రవారం రాత్రి స్వగ్రామంలో మృతి చెందారు. పమిడిముక్కల మండలం మంటాడకు చెందిన ఆయన 2019లో ఇక్కడ విధుల్లో చేరారు. 2020లో డెప్యూటేషన్‌పై ఉంగుటూరు మండల తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లారు. తదుపరి జిల్లా పునర్విభజనలో భాగంగా ఏడు నెలల క్రితం మదర్ ప్లేస్ గంపలగూడెంకు తిరిగి వచ్చారు. మృతుడికి భార్య ఇరువురు సంతానం. గంపలగూడెం తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి పలువురు వీఆర్వోలు మంటాడ వెళ్లి మృతదేహాన్ని సందర్శించి తమ ప్రగాఢ సంతాపాన్ని కుటుంబీకులకు తెలియజేశారు.

■ ఇంజినీరింగ్ విద్యార్థుల క్షేత్రపర్యటన

తిరువూరు: స్థానిక వాహినీ ఇంజినీరింగ్ కళాశాల ఈసీఈ విద్యార్థులు పారిశ్రామిక క్షేత్ర పర్యటనలో భాగంగా శనివారం తెలంగాణలోని సూర్యాపేట జిల్లాలో హైడ్రల్ పవర్ ప్లాంటును సందర్శించారు. ద్వితీయ సంవత్సరం బీటెక్ ఈసీఈ విద్యార్థులకు ప్లాంట్ పనిచేసే విధానాన్ని ఈసీఈ విభాగాధిపతి హరికృష్ణ వివరించారు.

■ పెన్షన్ అందజేత

చిట్యాల(తిరువూరురూరల్): మండలంలోని చిట్యాలకు చెందిన ఒక వితంతు మహిళ జగ్గయ్యపేటలోని తన కుమార్తె వద్ద ఉంటుండగా, ఆమెకు మార్చి నెలలో మంజూరైన వైఎస్ఆర్ పింఛను కానుక నగదును వలంటీరు అక్కడికి వెళ్లి అందజేశారు. చిట్యాలకు చెందిన అంబోజు సీతకు వలంటీరు బొల్లెపోగు శ్రీను శనివారం ఈ పెన్షను సొమ్ము అందజేశారు.

■ ఓటరుకార్డు అనుసంధానం పూర్తి చేయాలి

విజయవాడరూరల్: ఓటరుకార్డు అనుసంధానం వారం రోజుల్లో పోలింగ్ బూత్‌స్థాయి అధికారులు పూర్తి చేయాలని అసిస్టెంటు ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ అధికారి, తహసీల్దారు పి.జాహ్నవి అన్నారు. శనివారం మండల పరిషత్ హాల్లో మైలవరం నియోజకవర్గం పరిధిలోని పోలింగ్‌బూత్ ఆఫీసర్ల సమావేశం జరిగింది. మండలంలో 52 పోలింగ్ స్టేషన్ల పరిధిలో 49,553 మంది ఓటర్లుండగా వారిలో 37,451 మందికి ఓటరుకార్డు అనుసంధానం చేసినట్లు పేర్కొన్నారు. మిగిలిన వారికి వచ్చే వారంలో పూర్తి చేయాలన్నారు.

■ మధ్యాహ్న భోజనం రుచికరంగా ఉండాలి

చాట్రాయి: మధ్యాహ్న భోజనం రుచికరంగా తయారు చేయాలని ఎంపీడీఓ ఎన్.మురళీమోహనరావు సూచించారు. శనివారం మండంలోని పోతనపల్లి ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన పరిశీలించారు. భోజనం ఎలా ఉందని విద్యార్థులను అడగ్గా రుచికరంగా ఉంటుందని విద్యార్థులు చెప్పారు.

■ సుందరకాండ పారాయణం

ఆగిరిపల్లి: మండలంలోని వట్టిగుడిపాడు సెంటర్ రామాలయం కమిటీ ఆధ్వర్యంలో సుందరకాండ పారాయణాన్ని శనివారం నిర్వహించారు. లోక కల్యాణార్థం శ్రీవెంకటేశ్వర భజన సమాజం గురువు దామరాజు శివరావు ఆధ్వర్యంలో గ్రామంలోని రామాలయాన్ని 100వ దేవాలయంగా ఎంచుకుని సుందరకాండ పారాయణం జరిపించారు. కార్యక్రమానికి జ్యోతి దానకర్ణ దంపతులు, డాక్టర్ ఓలేటి వెంకట్ దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించారు.

■ వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన

నెమలి(గంపలగూడెం): నెమలి వేణుగోపాలస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈ నెల 7వ తేదీన వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు వ్యవసాయ అధికారి బి. సాయిశ్రీ తెలిపారు. గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏడో తేదీన ఉదయం 8 గంటల నుంచి ప్రదర్శన నిర్వహిస్తామన్నారు. రైతులు తాము పండించిన ఉత్పత్తులను తీసుకువచ్చి ప్రదస్నలో ఉంచవచ్చన్నారు. మేలు రకమైన ఉత్పత్తులను ఎంపిక చేసి బహుమతులు అందజేస్తామన్నారు.

■ ఎస్ఆర్ఐలో స్టూడెంట్స్ చాప్టర్

ఆగిరిపల్లి: పోతవరప్పాడు ఎస్ఆర్ఐ ఇంజినీరింగు కళాశాలలో శనివారం అంతర్జాతీయ ఇంజనీర్స్‌డే సందర్భంగా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ ఇండియా సహకారంతో స్టూడెంట్స్ చాప్టర్ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు కళాశాల చైర్మన్ ఆర్.వెంకట్రావు తెలిపారు. చైర్మన్ మాట్లాడుతూ సివిల్ విద్యార్థులు మోక్షగుండం విశ్వేశ్వరయ్య అడుగుజాడలో నడుస్తూ, స్వామి వివేకానంద జీవనశైలిగా మార్చుకుని దేశ ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయికి తీసుకువెళ్లాలని విద్యార్థులకు దిశా నిర్దేశం చేస్తున్నామన్నారు.

■ వైఎస్సార్ సీపీ సానుభూతి పరుడు రామాంజనేయులు మృతి

ఆగిరిపల్లి: మండలంలోని శోభనాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సానుభూతిపరుడు కడియాల రామాంజనేయులు (70) శుక్రవారం రాత్రి అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయన మృతి విషయం తెలుసుకున్న నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు శనివారం రామాంజనేయులు మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

■ ప్రతి గ్రామానికీ ఇంటర్‌నెట్ సౌకర్యం

ఆగిరిపల్లి: ప్రతి గ్రామంలో ఇంటర్‌నెట్ సౌకర్యం కల్పించేలా పని చేస్తున్నామని ఏపీ ఫైబర్ నెట్ ఈడీ, డ్రోన్స్ సీఈవో పి.జగన్‌మోహన్ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో వీడియో కాన్ఫరెన్స్ సిస్టం, అన్ని సచివాలయాల్లో ఫైబర్ నెట్ ద్వారా ఇంటర్ నెట్ సౌకర్యాన్ని కల్పించామన్నారు. మంచి క్వాలిటీతో నెట్ సౌకర్యాన్ని ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని వాటిని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 777 వీడియో కాన్ఫరెన్స్‌లకు ఫైబర్ నెట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం విద్యుత్ సబ్‌స్టేషన్‌లోని ఫైబర్ నెట్ సౌకర్యాన్ని పరిశీలించారు.

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి

నూజివీడు: పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి విశ్రాంత ఉద్యోగుల సంఘం నిరంతరం కృషి చేస్తోందని రాష్ట్ర అధ్యక్షుడు కె.ఆల్‌ఫ్రెడ్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం నూజివీడు శాఖ సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులందరూ సంఘటితంగా ఉన్నట్లయితే సమస్యలు సులువుగా పరిష్కరించుకోవచ్చన్నారు. రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఏలూరు జిల్లా ఉపాధ్య క్షులుగా ఎన్నికైన ఈమని శేషయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎన్నికైన సోమయాజులను స న్మానించారు. రాష్ట్ర సంఘం అసోసియేటెడ్ అధ్యక్షులు లక్ష్మీనారాయణ, జనరల్ సెక్రటరీ జయబాబు, కార్యదర్శి లోవకుమార్ పాల్గొన్నారు.

■ తాగునీరు అక్రమ తరలింపుపై ఆగ్రహం

మేడూరు(గంపలగూడెం): గంపలగూడెం మండలం మేడూరులో రక్షిత మంచినీటిని అక్రమంగా పొలానికి మళ్లించడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో రక్షిత మంచినీటి పథకం ద్వారా సరఫరా అయ్యే నీరు మెరక ప్రాంతాలకు సరఫరాకాక పలు కుటుంబాల వారు ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రామానికి చెందిన ఇరువురు రైతులు రక్షిత మంచినీటి పథకానికి చెందిన ట్యాప్ కనెక్షన్ నుంచి భూగర్భంలో పొలం వరకు ట్యూబు వేసుకుని తాము పెంపకం చేస్తున్న జాడుకు మళ్లిస్తున్నారని గ్రా మస్తులు తెలిపారు. ఈ విషయం గ్రామ సెక్రటరీ నాగేశ్వరరావుకు తెలిపినప్పటికీ నిర్లక్ష్యంగా ఉన్నారని వైఎస్సార్ సీపీ నాయకులు నల్లగట్ల బాలు ఆరోపించారు. ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకుని ప్రజలకు తాగునీరు సక్రమంగా సరఫరా అయ్యేలా చూడాలని కోరారు.

బ్రహ్మోత్సవాలలో సాంస్కృతిక ప్రదర్శనలు

నెమలి(గంపలగూడెం): నెమలి శ్రీ వేణుగోపాలస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆరురోజుల పాటు ఆలయ ప్రాంగణంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కావూరి శశిరేఖ, సహాయ కమిషనర్ డి. శ్రీరామ వర ప్రసాదరావు తెలిపారు. ఈ నెల ఐదో తేదీన విజయవాడ నటరాజ నృత్య కళానిలయం బృందంచే భరత నాట్యం, వెల్లంకి డ్యాన్స్ అకాడమిచే కల్చరల్ డ్యాన్స్ ప్రోగ్రాం, ఆరో తేదీన ఘంటసాల కల్చరల్ అసోసియేషన్ చే పాటలు, పద్యాలు, భగవద్గీత, శ్లోకాలు, వైరాకు చెందిన వెంకట్ డ్యాన్స్ అకాడమిచే కల్చరల్ డాన్స్ ప్రోగ్రాం, ఏడో తేదీన నాట్య కిరణ్ ఏ రిషిశ్రీ చే కూచిపూడి నృత్య ప్రదర్శన, 8న తిరువూరు గోదా నరసింహారావు బృందంచే భక్తి రంజని కార్యక్రమం, ఖమ్మం ఫైర్ రవి కళాబృందం వారిచే ఫైర్ డ్యాన్స్ మ్యాజిక్ మిమిక్రి, టాకింగ్ డాల్, భక్తి పాటలు, పేరడి పాటలు ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. 9న విజయవాడ మాధురి ఆర్కెస్ట్రాచే భక్తి గీతాలాపన, గూడవల్లి శివరంజని నాట్యమండలిచే శ్రీ కృష్ణార్జున గయోపాఖ్యానం, బ్రహ్మంగారి దివ్య చరిత్ర సత్యహరిచంద్ర నాటకాలు, 10న జగ్గయ్యపేటకు చెందిన జీవీఎల్ నరసింహరావుచే ముకుందా-ముకుందా భక్తిగీతాలు, తిరువూరుకు చెందిన మహాలక్ష్మీ కళాబృందంచే సినీ హాస్యవల్లరి, మిమిక్రి, మెజీషియన్, ఫైర్ డ్యాన్సులు ప్రదర్శిస్తారని పేర్కొన్నారు.